క్లుప్తంగా

ఐటీఐలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

స్టేషన్‌ఘన్‌పూర్: స్థానిక ఆదిత్య ఐటీఐలో 2024–25 సంవత్సరానికి ఎలక్ట్రీషియన్, ఫిట్టర్, డ్రాఫ్ట్‌మన్ సివిల్, మెకానిక్ డీజిల్ టైలరింగ్ తదితర ట్రేడ్‌లలో ప్రవేశంకోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ఐటీఐ కరస్పాండెంట్ జి.సునీత, డైరెక్టర్ శ్రీమన్నారాయణ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. జూన్ 10 వరకు ఆన్‌లైన్ అడ్మిషన్లు జరుగుతాయని, పదో తరగతి ఉత్తీర్ణులైన వారు, ఇంటర్, డిగ్రీ పాస్, ఫెయిల్ అయినవారు అర్హులని తెలిపారు. పూర్తి వివరాల కోసం 8374650070, 9391180737 నంబర్లలో సంప్రదించాలని వారు సూచించారు.

నిత్యావసర సరుకుల అందజేత



తరిగొప్పుల: మండలంలోని అక్కరాజుపల్లికి చెందిన వల్లెపు మల్లయ్య ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. కాగా బాధిత కుటుంబ సభ్యులను రెయిన్‌బో యూత్ సభ్యులు శుక్రవారం పరామర్శించి 25 కిలోలబియ్యం, 5 కిలోల వంట నూనె అందజేశారు. పరామర్శించిన వారిలో అసోసియేషన్ అధ్యక్షుడు అంకం రాజు, అక్తర్, జొన్నగోని రాజు, తరుణ్, సాంబరాజు తదితరులు ఉన్నారు.

దేవస్థాన భూమి సర్వే



స్టేషన్‌ఘన్‌పూర్: స్థానిక బస్టాండ్ సమీపంలో ఉన్న 641 సర్వేనంబర్‌లోని శ్రీతిరుమలనాథ స్వామి దేవస్థాన భూమిని రెవెన్యూ అధికారులు శుక్రవారం సర్వే చేపట్టారు. దేవాదాయ శాఖ, ఆర్టీసీ అధికారుల సమక్షంలో వారు సర్వే చేశారు. ఈసందర్భంగా డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ సర్వే రాజు మాట్లాడుతూ వివరాలు తెలిపారు. పట్టాదారు ఫిర్యాదు మేరకు 641 సర్వే నంబర్‌లో సర్వే చేయడం జరిగిందన్నారు. దేవాలయానికి సంబంధించి మొత్తం 3 ఎకరాల 29 గుంటలకు గాను రెండెకరాలు గతంలో ఆర్టీసీ వారికి అందించారని, మిగిలిన ఎకరం 19 గుంటలకు సర్వే చేసి హద్దులను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. సర్వే నివేదికను ఉన్నతాధికారులకు అందిస్తామన్నారు.

ఓటరు స్లిప్‌లు పంపిణీ చేయాలి



బచ్చన్నపేట : మండలంలోని అన్ని గ్రామాల్లో పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల ఓటరు స్లిప్‌లను పంపిణీ చేయాలని తహసీల్దార్ విశాలాక్షి తెలిపారు. శుక్రవారం తహసీల్ కార్యాయంలో బీఎల్‌ఓలతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ మండలంలోని అన్ని గ్రామాల్లో 1,275 పురుషులు, 719 స్త్రీలు మొత్తం 1,995 ఓట్లు ఉన్నాయని అన్నారు. స్థానిక జెడ్పీ ఉన్న పాఠశాలలో పోలింగ్ స్టేషన్–8, 9 లలో ఓటింగ్ వేయాలని అన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ ఖాసీమ్, ఎంఆర్ఐ శ్రీనివాస్‌రావు, జూనియర్ అసిస్టెంట్ యాకయ్య , బీఎల్‌ఓలు పలువురు పాల్గొన్నారు.

‘డీటీడీఓపై ఆరోపణలు తగదు’

కొడకండ్ల : గత మూడేళ్లుగా హనుమకొండ, జనగామ జిల్లాల గిరిజన అభివృద్ధి అధికారిగా అంకితభావంతో సేవలందిస్తున్న ప్రేమకళారెడ్డిపై కొందరు పనిగట్టుకొని ఆరోపణలు చేయడం తగదని ఎల్‌హెచ్‌పీఎస్ వ్యవస్థాపక సభ్యుడు భూక్యా శ్రీనునాయక్ అన్నారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ గిరిజన విద్యార్థుల విద్యాభ్యున్నతి కోసం నిరంతరం కృషి చేస్తున్న డీటీడీఓపై వార్డెన్ల నుంచి డబ్బులు వసూలు చేస్తుందని కొందరు గిరిజన నాయకులు తప్పుడు ప్రచారం చేస్తున్నారన్నారు. అవినీతికి పాల్పడితే నిరూపించాలే తప్ప అర్థంలేని విమర్శలు చేయకూడదని ఆయన అన్నారు.

అదుపు తప్పి డీసీఎం బోల్తా



జనగామ రూరల్: తరిగొప్పుల మండలంలోని అబ్దుల్‌నాగారం గ్రామానికి చెందిన ధాన్యం కొనుగోలు చేసిన వడ్ల లోడ్‌తో వస్తున్న డీసీఎం శుక్రవారం సాయంత్రం గానుగుపహాడ్ స్టేజీ మూల మలుపు వద్ద అదుపుతప్పి బోల్తా పడింది. దీంతో డ్రైవర్‌కు గాయాలయ్యాయి. ధా న్యం బస్తాలు చెల్లాచెదురుగా పడిపోయాయి. డ్రైవర్‌ను ఏరియా ఆస్పత్రికి తరలించారు.

అదుపు తప్పితే.. అంతే సంగతి

- రోడ్డు పక్కనే ప్రమాదకరంగా ఉన్న బావి
- కొరవడిన అధికారుల పర్యవేక్షణ
- చుట్టూ రక్షణ చర్యలు చేపట్టాలని పలువురు వేడుకోలు



ధర్మాపురం-వానకొండయ్యగుట్ట బీటీ రోడ్డు పక్కన ప్రమాదకరంగా ఉన్న బావి

దేవరుప్పుల : మారుమూల ప్రాంతాల్లో రోడ్డు విస్తరణ పనులు చేపట్టే క్రమంలో సంబంధిత అధికారుల పర్యవేక్షణ లోపంతో ముందుచూపు లేకపోవడంతో పొదలమాటున పొంచి ఉన్న ప్రమాదం తీరు ధర్మాపురంలో నెలకొంది. గత ఏడాది ధర్మాపురం పడమటితండా నుంచి శాతాపురం క్రాసింగ్ వరకూ బీటీ రోడ్డు నిర్మాణ పనులు చేపట్టే క్రమంలో లాకావత్‌తండా(డీ) దుర్గమ్మగుడి ఏరియా క్రాసింగ్ దాటగానే పక్కకే పాత వ్యవసాయ బావి ఉంది. సదరు రైతు భవిష్యత్‌లో సాగునీటి కోసమని ఉంచుకోగా రోడ్డు విస్తరణతో బావి పక్క వరకూ వచ్చింది. దీంతో పెరిగిన చెట్లపొదల మాటున బావి ఉన్న విషయాన్ని వాహనదారులతోపాటు పాదచారులు సైతం కనిపెట్టని పరిస్థితి ఉంది. ఈ ప్రమాదపు ఘటన స్థలం వద్ద రక్షణ గోడలను సత్వరమే నిర్మించాలని పలువురు కోరుతున్నారు.

అభివృద్ధిని ప్రజల్లోకి తీసుకెళ్లాలి



కడియం కావ్యను సన్మానిస్తున్న రఘునాథ్‌పల్లి పార్టీ నాయకులు, గ్రామస్తులు

జఫర్‌గఢ్: కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టే ప్రతి సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లేలా కార్యకర్తలు కృషి చేయాలని ఎమ్మెల్యే కడియం శ్రీహరి కోరారు. మండలంలోని రఘునాథ్‌పల్లి గ్రామానికి చెందిన ఎంపీటీల ఫోరం జిల్లా అధ్యక్షుడు ఎడ్ల వెంకట స్వామి, మాజీ సర్పంచ్ బొమ్మినేని శ్రీదేవి పెద్దిరెడ్డి, ఎస్ఎస్‌యూఐ మండల అధ్యక్షుడు ఎడ్ల సందీప్‌తో పాటు గ్రామానికి చెందిన పార్టీ నాయకులు, కార్యకర్తలు హనుమకొండలోని తన నివాసంలో ఎమ్మెల్యే కడియం శ్రీహరి, ఎంపీ అభ్యర్థి కడియం కావ్యను శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శ్రీహరి మాట్లాడుతూ పార్లమెంట్ ఎన్నికల్లో పార్టీ అభ్యర్థి గెలుపునకు కృషిచేసిన పార్టీ నాయకులు, కార్యకర్తలకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ కోసం పనిచేసే ప్రతి కా ర్యకర్తను కంటికిరెప్పలా కాపాడుకుంటానన్నారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో పార్టీ నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు ఉన్నారు.

ఎమ్మెల్సీగా మల్లన్నను గెలిపించండి



నర్మెట : ఇంటింటి ప్రచారం చేస్తున్న కాంగ్రెస్ నేతలు



తరిగొప్పుల: మాట్లాడుతున్న అకఖిల్ భాషా

నర్మెట: ఉమ్మడి వరంగల్, ఖమ్మం, నల్లగొండ జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేస్తున్న తీన్మార్ మల్లన్న (చింతపండు నవీన్)కు మొదటి ప్రాధాన్యతా ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ప్రచార కమిటీ టీం ఇన్‌చార్జ్‌లు ఎండి.అకఖిల్ బాషా, నాగరాజు, శివారెడ్డి అన్నారు. మండలకేంద్రంలోని పార్టీ కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన ముఖ్యకార్యకర్తల సమావేశంలో దిశానిర్దేశం చేసిన అనంతరం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో మండల శాఖ అధ్యక్షుడు రాజబోయిన లక్ష్మీనారాయణ, గ్రామ శాఖ అధ్యక్షుడు ప్రజ్ఞాపురం శ్రీధర్, ఓబీసీ సెల్ రాష్ట్ర కార్యదర్శి ఫరీదుల యాదయ్య, జిల్లా కార్యదర్శి భూక్య జయరాం, సీనియర్ నాయకులు బండి అశోక్, కొంరయ్య, శ్రీనివాస్, సరాబు మధు, తదితరులు పాల్గొన్నారు.

బచ్చన్నపేట : వరంగల్, ఖమ్మం, నల్గొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి తీన్మార్ మల్లన్నను ఆదరించాలని కాంగ్రెస్ ఎమ్మెల్సీ ఎన్నికల నియోజకవర్గ ఇన్‌చార్జ్ మహమ్మద్ అకఖిల్ భాషా అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని శ్రీనివాస గార్డెన్‌లో మండల అధ్యక్షుడు నూకల బాల్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన ఆయన పాల్గొని మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో విసిగి వేసారిన ప్రజలు అసెంబ్లీ ఎన్నికల్లో మార్పును కోరుకున్నారని అన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీలు, మాజీ సర్పంచ్‌లు, మండల అధ్యక్ష, ఉపాధ్యక్షులు, కార్యదర్శులు, పట్టభద్రులు పాల్గొన్నారు.

తరిగొప్పుల: వరంగల్, ఖమ్మం, నల్లగొండ పట్టభద్రుల ఉపఎన్నికల్లో తీన్మార్ మల్లన్న గెలుపునకు కృషిచేయాలని ఎన్నికల జనగామ జిల్లా ఇన్‌చార్జ్ అకఖిల్ పాషా అన్నారు. గ్రామశాఖ అధ్యక్షుడు పందుగ కనుకయ్య అధ్యక్షతన శుక్రవారం మండలకేంద్రంలో పార్టీ ముఖ్యనాయకుల సమావేశం నిర్వహించారు. మండల అధ్యక్షుడు యాదగిరితో కలిసి ఆయన పాల్గొని మాట్లాడుతూ ప్రతీ గ్రాడ్యుయేట్ వద్దకు వెళ్లి మొదటి ప్రాధాన్యత ఓటు తీన్మార్ మల్లన్నకు వేసే విధంగా ప్రచారం నిర్వహించాలని సూచించారు. కార్యక్రమంలో గోరంతల వీరన్న, లూకా, శివకుమార్, పోషయ్య, శ్రీనివాస్, చంద్రయ్య, యాకూబ్ పాషా,సదయ్య, పోషిరెడ్డి, థామస్, మహేందర్, తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా ఆలయ వార్షికోత్సవం



మంగళహారతులతో మహిళా భక్తులు

జనగామ: పట్టణంలోని రైల్వేస్టేషన్ ఆవరణలోని శ్రీవాసవీ కన్యకాపరమేశ్వరీ, నగరేశ్వర, శ్రీ సీతా రామచంద్రస్వామి ప్రథమ వార్షికోత్సవ వేడుకలు శుక్రవారం కనులపండువగా జరిగాయి. ఉదయం వేద స్వస్తిపూర్వక ఆలయ ప్రవేశం, గణపతిపూజ, పంచగవ్య మేళన ప్రాశన, అఖండ దీపస్థాపన, ప్రధాన కలశస్థాపన, ప్రాణ, అగ్నిప్రతిష్ఠ తదితర కార్యక్రమాలను నిర్వహించారు. శనివారం, ఆదివారం వార్షికోత్సవ వేడుకలు కొనసాగుతాయని నిర్వాహక ప్రతినిధులు చెప్పారు.

మండలంలో 2,504 గ్రాడ్యుయేట్ ఓట్లు

పాలకుర్తి: ఈ నెల 27న ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ జరుగుతుందని తహసీల్దార్, ఎన్నికల నిర్వాహకుడు వెంకటేశం తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ మండలంలో 2,504 గ్రాడ్యుయేట్ ఓట్లు ఉన్నాయని అన్నారు. స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాల ఆవరణలో మూడు పోలింగ్‌కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. మండలంలో ఉన్న 36 గ్రామ పంచాయతీలను మూడు పోలింగ్ కేంద్రాలకు ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు.

తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలి

కొడకండ్ల : అకాల వర్షాలతో తడిసిన వరి ధాన్యాన్ని ప్రభుత్వం తక్షణమే కొనుగోలు చేసి రైతులను ఆదుకోవాలని మార్కెట్ కమిటీ చైర్మన్ పేరం రాము డిమాండ్ చేశారు. శుక్రవారం మండలకేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ సకాలంలో ధాన్యాన్ని కొనుగోలు చేయకపోవడంతో అకాల వర్షాలు కురిసి పలుచోట్ల ధాన్యం తడిసిందన్నారు. తడిసిన ధాన్యం కొనుగోలు చేసి రైతులను ఆదుకోవడంలో ప్రభుత్వం వైఫల్యం చెందిందని ఆరోపించారు. ఎన్నికల సందర్భంగా రైతులకు రూ.500 బోనస్ ఇస్తామన్న కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేయకుండా మోసం చేసిందన్నారు. ఇచ్చిన హామీలను అమలు చేయాలని ఆయన కోరారు.

పాలకుర్తి టౌన్ : అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను ఆదుకోవాలని జెడ్పీటీసీ పుస్కూరి శ్రీనివాసరావు అన్నారు. శుక్రవారం ఆయన పాలకుర్తిలో విలేకరులతో మాట్లాడుతూ ప్రభుత్వం ఇచ్చిన వాగ్దానాలు అమలు చేయాలని అన్నారు. తడిసిన ధాన్యంను కొనుగోలు చేయక పోవడంతో రైతులు తీవ్రంగా నష్టంపోవడం జరిగిందని అన్నారు. రైతులకు బోనస్‌గా రూ. 500 ఇస్తామని హామీ ఇచ్చి అమలు చేయడం లేదని అన్నారు. రైతులకు పెట్టుబడి పథకంలో రూ.15 వేలకు పెంచుతామని హామీ ఇచ్చి అమలు చేయడం లేదని అన్నారు. ఖరీఫ్ సీజన్ ప్రారంభం కాబోతున్న తరుణంలో రైతులకు పెట్టుబడి ఇవ్వడం లేదని అన్నారు. రైతు భరోసా చెల్లించాలని డిమాండ్ చేశారు.

బాధిత మహిళలకు అండగా ‘సఖి’



చట్టాలపై అవగాహన కల్పిస్తున్న సఖి సెంటర్ సభ్యులు

మడికొండ: బాధిత మహిళలు, బాలికలకు సఖి సెంటర్ అండగా ఉంటోందని నిర్వాహకులు తెలిపారు. మహిళలకు చట్టాలపై కాజీపేట మండలం టేకులగూడెం గ్రామంలోని మహిళలకు శుక్రవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా లీగల్ కౌన్సెలర్ శ్రీదేవి, కేసు వర్కర్ హరిత పాల్గొని సఖి సెంటర్ ముఖ్య ఉద్దేశాలు, గృహ హింస, లైంగిక వేధింపులు, పనిచేసే చోట వేధింపులు, అత్యాచార బాధితులకు రక్షణ కల్పించడానికి సఖి సెంటర్ పనిచేస్తోందని వివరించారు. సఖి సెంటర్ 24గంటల పాటు పని చేస్తుందని, ఆపద సమయంలో 0870 2452112, లేదా 181 టోల్‌ఫ్రీ నంబర్‌కు కాల్‌చేసి తక్షణ సహాయం, రక్షణ పొందాలని చెప్పారు. కార్యక్రమంలో సర్వోదయ యూత్ ఆర్గనైజేషన్, మహిళా గ్రూపు సభ్యులు పాల్గొన్నారు.

ఫైసా ఖర్చు లేకుండా ఆపరేషన్

- ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపిన బాధిత కుటుంబ సభ్యులు



ఎమ్మెల్యేను కలిసి కృతజ్ఞతలు తెలిపిన బాధితుడు, కుటుంబ సభ్యులు

జనగామ: జిల్లా కేంద్రలోని అంబేడ్కర్‌నగర్‌కు చెందిన పూసలోజు రవి కులవృత్తి చేస్తుండగా ప్రమాదవశాత్తు ఎడమ చేయికి తీవ్రగాయమైంది. ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డికి సహకారంతో రూపాయి ఖర్చు లేకుండా ఉచిత ఆపరేషన్ జరిగిందని బాధితుడి భార్య జ్యోతి తెలిపింది. శుక్రవారం బాధిత కుటుంబ సభ్యులు ఎమ్మెల్యేను కలిసి కృతజ్ఞతలు తెలిపి మాట్లాడారు. కులవృత్తి పని చేసుకుంటున్న సమయంలో ఎడమ చేయి మిషన్‌లో ఇరుక్కుపోయి, డ్యామేజీ తీవ్రత ఎక్కువగా ఉండడంతో పట్టణంలోని ఆస్పత్రికి తీసుకెళ్లామన్నారు. వైద్యులు సర్జరీ చేయాలని చెప్పడంతో బీఆర్ఎస్ నాయకులు గజ్జెల నర్సిరెడ్డి సహకారం కోరగా హైదరాబాద్‌లోని ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డికి చెందిన నీలిమా ఆస్పత్రికి తీసుకెళ్లినట్లు తెలిపారు. అక్కడ ఒక్కరూపాయి ఖర్చు లేకుండా ఉచితంగా సర్జరీ చేయడంతో పాటు మందులు ఇచ్చి డిచార్జి చేశారన్నారు. ఎమ్మెల్యే రాజేశ్వర్‌రెడ్డి మా ఇంటి దేవుడిగా మారాడన్నారు.

ఉపఎన్నికలో బీజేపీ అభ్యర్థిని గెలిపించాలి



సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర నాయకులు

పాలకుర్తి టౌన్: వరంగల్, ఖమ్మం, నల్లగొండ పట్టభద్రుల శాసనమండలి ఉప ఎన్నికలో బీజేపీ రాష్ట్ర నాయకుడు గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డిని ఎమ్మెల్సీగా గెలిపించాలని ఆ పార్టీ రాష్ట్ర నాయకులు, ఎమ్మెల్సీ ఎన్నికల ప్రభారీ కసిరెడ్డి, భాస్కర్‌రెడ్డి పిలుపునిచ్చారు. శుక్రవారం పాలకుర్తిలో పూసాల శ్రీనివాస్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన ఎమ్మెల్సీ ఎన్నికల సన్నాహక సమావేశంలో వారు మాట్లాడారు. గత 30 ఏళ్ల నుంచి గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డి నిజాయితీగా రాజకీయం చేస్తున్నారని అన్నారు. ఆయన గెలిస్తే నిరుద్యోగుల పక్షాన, విద్యార్థుల పక్షాన, విద్యారంగంపై కొనసాగుతున్న వివక్షపై ప్రభుత్వంతో కొట్లాడి సాధిస్తారని అన్నారు. సమావేశంలో బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు దొంగరి మహేందర్, జిల్లా కార్యదర్శులు మోడపల్లి సోమన్న, సాయిని, ఝాన్సీ, గడ్డం నరేందర్, జిల్లా నాయకులు కమ్మగాని శ్రీకాంత్, నవీన్‌రెడ్డి, వివిధ మండల అధ్యక్షుడు పల్లె కుమార్, దుంపల సంపత్, బొచ్చు నరేష్, వడ్లకొండ రవి, సుధాకర్, ఉపేందర్, సత్తన్న, బూత్ కోఆర్డినేటర్లు మంజుల శ్రీనివాస్, అనిల్, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ



స్టేషన్‌ఘన్‌పూర్: ఇప్పగూడెంలో సోమయ్య కుటుంబాన్ని పరామర్శిస్తున్న ఎమ్మెల్యే కడియం



చిల్పూరు: రమ్యశ్రీకి ఆర్థికసాయం అందజేస్తున్న పూర్వ విద్యార్థులు



బచ్చన్నపేట: ఆర్థికసాయం అందిస్తున్న శివకుమార్

స్టేషన్‌ఘన్‌పూర్ : మండలంలోని ఇప్పగూడెం గ్రామానికి చెందిన నీరటి సోమయ్య ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా ఎమ్మెల్యే కడియం శ్రీహరి శుక్రవారం బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. ముందుగా సోమయ్య చిత్రపటం వద్ద పూలమాల వేసి నివాళులర్పించారు. అలాగే మండలంలోని సముద్రాల గ్రామ మాజీ ఉపసర్పంచ్ ఇమ్మడి ప్రసాద్ అనారోగ్యంతో బాధపడుతుండగా అతడి నివాసానికి వెళ్లి పరామర్శించారు. అతడి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకుని ధైర్యం చెప్పారు. ఎమ్మెల్యే వెంట నాయకులు బెలిదె వెంకన్నగుప్తా, జూలుకుంట్ల శిరీష్‌రెడ్డి, ఇనుగాల వెంకటేశ్వర్‌రెడ్డి, కత్తుల కట్టయ్య, గొడుగు రాజయ్య, పడిశాల వెంకటేష్, లింగబోయిన శ్రీను, ఎల్లగౌడ్, నరేందర్, మంద రాజు, అయ్యప్ప శ్రీను తదితరులున్నారు. అలాగే ఘన్‌పూర్ డివిజన్ కేంద్రానికి చెందిన బోయిని ఉప్పలయ్య అనారోగ్యంతో మృతి చెందగా జిల్లా కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షుడు పోగుల సారంగపాణి శుక్రవారం బాధిత కుటుంబానికి రూ.5వేలు ఆర్థికసాయం అందించారు. ముందుగా మృతదేహాన్ని సందర్శించి పూలమాల వేసి నివాళులర్పించారు. మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. పరామర్శించిన వారిలో నాయకులు పొన్న రాజేష్, చేపూరి ప్రభాకర్, పొన్న చిన్నరాజేష్ తదితరులు ఉన్నారు.

పూర్వ విద్యార్థుల ఆర్థికసాయం

చిల్పూరు: మండల కేంద్రానికి చెందిన ఆకుల సురేష్ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. 1998–99 పదోతరగతి బ్యాచ్ విద్యార్థులు మృతి చెందిన తోటి మిత్రుని కుటుంబాన్ని ఆదుకోవాలని శుక్రవారం రూ. 30 వేలను సురేష్ కుమార్తె రమ్యశ్రీ పేర బ్యాంకులో డిపాజిట్ చేసి బాండ్ అందజేశారు.

బచ్చన్నపేట : మండలంలోని కొన్నె గ్రామంలో పలువురు బాధితుల కుటుంబాలకు ఆ గ్రామ నాయకులు, సామాజిక సేవాకర్త కోడూరి శివకుమార్‌గౌడ్ ఆర్థికసాయాన్ని శుక్రవారం అందించారు. గ్రామానికి చెందిన ఎనుగుల శ్రీలత, కుందారపు ధనుంజయ, చీర మాధవి నిరుపేద మూడు కుటుంబాల వారు ఆస్పత్రిలో చికిత్స పొందుతుండగా వారి ఆస్పత్రి ఖర్చులు, మందులకు గానూ ఆర్థికసాయాన్ని అందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పేదలకుసాయం చేయడంలో తృప్తి ఉందన్నారు.

భారీవర్షంతో కూలిన ఇంటి పిట్టగోడ

- రెండు మేక పిల్లలు మృతి
- తప్పిన ప్రాణాపాయం



భారీ వర్షంతో కూలిన పిట్టగోడ, బాల్కాని

జఫర్‌గఢ్: ఉరుములు, మెరుపులు, ఈదురుగాలలతో కూడిన భారీ వర్షం కురియడంతో స్లాబ్‌పై ఉన్న పిట్టగోడ, బాల్కాని కూలి రెండు మేకపిల్లలు మృత్యువాత పడిన సంఘటన మండలంలోని మగ్దుం తండాలో శుక్రవారం చోటు చేసుకుంది. ఇదే తండాకు చెందిన బానోత్ సోమ్లు ఇంట్లో నిద్రిస్తున్న సమయంలో గురువారం అర్ధరాత్రి ఈదురు గాలులతో కూడిన భారీ వర్షం కురియడంతో ఒక్కసారిగా స్లాబ్ ఇంటి సంబంధించిన పిట్టగోడ, పై భాగంలో ఉన్న బాల్కాని ఒక్కసారిగా కూలడంతో దీనికింద ఉన్న రెండు మేకపిల్లలు మృతి చెందాయి. ఇంట్లోనే నిద్రిస్తున్న సోమ్లు అతని కుటుంబ సభ్యులకు ఎలాంటి ప్రాణాప్రాయం జరగలేదు. సోమ్లు కుటుంబానికి ప్రభుత్వ పరంగా ఆర్థికసాయం అందించి ఆదుకోవాలని తండావాసులు కోరారు. జరిగిన నష్టంపై బాధితుడు స్థానిక తహసీల్దార్ ఆంజనేయులుకు లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేసినట్లు ఆర్ఐ అనిల్‌బాబు తెలిపారు.

పిడుగుపాటుకు గేదె మృతి



పాలకుర్తి టౌన్: మండలకేంద్రంలోని హరిజన కాలనీ గ్రామ పంచాయతీకి చెందిన రైతు ఐలేని దేవేందర్‌రావుకు చెందిన గేదె గురువారం రాత్రి కురిసిన వర్షానికి ఆకస్మికంగా మృతి చెందింది. ఇంటి ఆరుబయట కట్టివేసిన బర్రెపై పిడుగు పడటంతో అకస్మాత్తుగా అక్కడే మృతి చెందింది. మృతి చెందిన గేదె రూ. 70 వేలు విలువ ఉంటుందని రైతు ఆవేదన వ్యక్తం చేశాడు. ప్రభుత్వం సాయం అందించి ఆదుకోవాలని రైతు కోరాడు.

పాఠశాలల్లో వసతులు కల్పించాలి



సాల్వాపూర్ పాఠశాలలో పనులను పరిశీలిస్తున్న ఎంపీడీఓ రఘురామకృష్ణ

బచ్చన్నపేట : ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల సౌకర్యార్థం అన్ని రకాల వసతుల కల్పనే ప్రభుత్వ లక్ష్యమని ఎంపీడీఓ రఘురామకృష్ణ అన్నారు. శుక్రవారం మండలంలోని సాల్వాపూర్‌లోని ప్రభుత్వ పాఠశాలలో అమ్మ ఆదర్శ పాఠశాల కార్యక్రమంలో భాగంగా చేపట్టిన పలు అభివృద్ధి పనులను ఆయన పరిశీలించారు. అలాగే పల్లె ప్రకృతి వనం, ఈజీఎస్ పనులను పరిశీలించిన అనంతరం మాట్లాడుతూ పనులను నాణ్యతతో చేయాలని అప్పుడే వంద శాతం బిల్లులు అందుతాయన్నారు. సంప్ నిర్మాణం , పలు అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి మామిడాల మధు పలువురు పాల్గొన్నారు.

మాలధారులకు అన్నదానం



అన్నదానం చేస్తున్న సద్దాంహుస్సేన్ దంపతులు

వేలేరు : కులమతాలకు అతీతంగా హిందు, ముస్లింలు అన్నదమ్ముళ్లా కలిసి ఉండాలని మాజీ ఉపసర్పంచ్ సద్దా హుస్సేన్ కోరారు. శుక్రవారం హనుమాన్ మాలధారులకు అన్నదానం చేశారు. స్థానిక రుద్ర రామేశ్వరాలయంలో కుటుంబ సభ్యులతో కలిసి హనుమాన్ స్వాములకు అన్నదానం చేపట్టారు. సలీంమాలిక్, స్వాములు ఉన్నారు.

తాత్కాలిక మట్టి రోడ్డు వేయించిన ఎంపీటీసీ



చిల్పూరు: మండలంలోని నష్కల్ అండర్ రైల్వేబ్రిడ్జి కింద వర్షపు నీరు నిలుస్తుండడంతో ప్రయాణికులు, వాహన చోదకులు ఇబ్బంది పడకుండా తాత్కాలిక మట్టిరోడ్డు పనులను ఎంపీటీసీ పాశం శిరీషసురేష్, మాజీ సర్పంచ్ కర్ణకంటి స్వప్న వెంకటేష్ శుక్రవారం వేయించారు. నష్కల్ నుంచి రెండు కిలోమీటర్ల దూరంలో ఉన్న జాతీయ రహదారికి చేరుకోవాలంటే రైల్వే అండర్ బ్రిడ్జి దాటాలి. ప్రస్తుతం వర్షాలు పడుతుండడంతో అందులోకి నీరు చేరడంతో బాటసారులు, వాహనదారులు ఇబ్బంది పడుతున్నారు. ఇది గమనించిన వారు అండర్‌బ్రిడ్జి పక్కన ఉన్న 10 ఫీట్ల రోడ్డును 16 ఫీట్లుగా పొక్లయినర్‌తో పనులు చేయించారు.